ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
మంగళవారం 27 ఆగస్టు 2024 | 5





కృష్ణాష్టమి సందర్భంగా కాకినాడ మధురానగర్‌లోని గోకులంలో నృత్యప్రదర్శన

హే కేశవ.. హే మాధవ.. హే గోవిందా

జిల్లాలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. హే కేశవ.. హే మాధవ.. హే గోవిందా.. అంటూ చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో ఆకట్టుకున్నారు. కాకినాడ నగరంతోపాటు అన్ని మండలాల్లోని గ్రామాల్లో స్థానిక కమిటీల ఆధ్వర్యంలో ఉట్టికొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. యువత ఉత్సాహభరితంగా పాల్గొని ఉట్టి కొట్టారు. పలుచోట్ల బహుమతులు అందుకున్నారు.

- ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు





కాకినాడ ద్వారకానగర్‌లో కృష్ణాష్టమి సందర్భంగా ఉత్సాహభరితంగా ఉట్టి కొడుతున్న యువకులు



ప్రత్తిపాడు మండలం రాచపల్లిలో రమణ ఆశ్రమంలో ఉట్టి కొడుతున్న విద్యార్థులు



ఏలేశ్వరం మండలం లింగంపర్తిలో ఉట్టి కొట్టే ఉత్సవంలో పాల్గొన్న గోవులు



కాకినాడలో ఉట్టికొడుతున్న యువకులు, చిన్నారులు



జ్వరంతో.. గజగజ

జిల్లాను జ్వరాలు కుదిపేస్తున్నాయి. మలేరియా, డెంగీతో వేలాదిమందిని మంచం పట్టేలా చేస్తున్నాయి. పిల్లల నుంచి పెద్దల వరకు, మహిళలనుంచి వృద్ధుల వరకు గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో జ్వరాలతో జనం అల్లాడుతున్నారు. తీవ్ర జ్వరం, దగ్గు, తలనొప్పి, గొంతు నొప్పితో సతమతమవుతున్నారు. వాతావరణ మార్పులు, ఫ్లూ పంజాతో జిల్లాలో పెద్దఎత్తున జ్వర పీడితులు పెరుగుతున్నారు. జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.

- జిల్లాపై జ్వరాల పంజా: మలేరియా, డెంగీతో వేలల్లో మంచం పడుతున్న బాధితులు
- ఎక్కడ చూసినా జనం దగ్గు, రొంప, జలుబు, వాంతులు, విరోచనాలతో సతమతం
- ప్లేట్‌లెట్స్ పడిపోయాయంటూ వైద్యం పేరుతో వేలల్లో దండేస్తున్న వైనం
- నెల వ్యవధిలో జ్వరంతో పెద్దాపురంలో ముగ్గురు విద్యార్థుల మృత్యువాత
- జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఫీవర్ సర్వేలో భారీగా నమోదవుతున్న కేసులు
- జనవరి నుంచి ఇప్పటివరకు జిల్లాలో 1.29లక్షల జ్వర బాధితులు గుర్తింపు
- మరో 4,115మందికి డెంగీ పరీక్షలు చేయగా 106 మంది కేసులు రాక
- అనధికారికంగా ఇంకా వేలల్లోనే బాధితులు: అత్యధికంగా పిల్లలు, వృద్ధులకు జ్వరాలు
- కాకినాడ జీజీహెచ్‌కు రోజుకు 70మంది జ్వరంతో చేరిక: కిక్కిరిస్తున్న వార్డులు

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)/పెద్దాపురం:

ప్రస్తుతం జిల్లాలో ప్రతి గ్రామంలోను, పట్టణాల్లోను జ్వరాలతో వందలాదిమంది సతమతమవుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న వారిలో అనేకమంది ప్రైవేటు ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. తీరా అక్కడ టెస్టులు, ప్లేట్‌లెట్స్ పేరుతో వేలల్లో గుంజేస్తున్నారు. అయిన కాడికి రోగులను బాదేస్తున్నారు. కాకినాడ జీజీహెచ్‌కు అయితే రోజుకు 70 జ్వరం కేసులు వస్తున్నాయి. బాధితులతో వార్డు లు కిక్కిరుస్తున్నాయి. మరోపక్క జ్వరంతో ఇప్పటివరకు జిల్లా లో ముగ్గురు విద్యార్థులు చనిపోవడం కలకలం రేపుతోంది. కాగా జిల్లాలో జనవరి నుంచి ఆగస్టులో ఇప్పటివరకు 1.29లక్షల మందికి జ్వరం సోకింది. 4,115మందికి డెంగీ పరీక్షలు చేస్తే 106మంది బాధితులున్నట్లు తేలింది. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా కొనసాగుతున్న ఫీవర్ సర్వేలోను బాధితులు భారీగా తేలుతున్నారు.

గజగజ వణికిపోతున్నారు..

జిల్లాలో వరుసగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఆ వెంటనే రెండురోజులు తెరిపిచ్చి మళ్లీ ఎండలు దంచి కొడుతున్నాయి. అటు రాత్రివేళల్లో మంచు కూడా క్రమేపీ పెరుగుతోంది. ఈ నేపథ్యంలో తీవ్రవేడి, ఉక్కబోత వాతావర ణం, అకాల వర్షాలు.. వెరసి వాతావరణ మార్పులతో జిల్లాలో జ్వరాల తీవ్రత అధికంగా ఉంది. దీంతో ప్రతిరోజూ ప్రభుత్వ ఆస్పత్రులకు వందల సంఖ్యలో రోగులు జ్వరాలతో బాధపడుతూ వస్తున్నారు. ఆస్పత్రుల్లో చేరిన వారికి ఎలిసా టెస్టులు నిర్వహించి రోగ నిర్ధారణకోసం రక్తం, మూత్రం, శాంపిళ్లను జిల్లా కేంద్రానికి పంపిస్తున్నారు. వాటి ఫలితాలు అందడానికి ఒకరోజు పడుతోంది. ఈలోపు డెంగీ బారిన పడినవారిలో రక్త కణాలు తగ్గడంతో కొందరికి ప్రాణాపాయం కలుగుతోంది. వర్షాకాలం కావడంతో హెపటైటీస్ (కామెర్లు) వ్యాధి కూడా వ్యాపిస్తోంది. కలుషిత నీరు, ఆహారం తీసుకోవడం వల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందని వైద్యులు చెబుతున్నారు.

సీజనల్ వ్యాధుల పంజా

ఇప్పుడు జిల్లావ్యాప్తంగా సాధారణ జ్వరాలతోపాటు మలేరియా, డెంగీ జ్వరపీడితుల సంఖ్య పెరిగిపోతోంది. అనేకమంది వయస్సుతో సంబంధం లేకుండా తీవ్ర జ్వరం, దగ్గు, తలనొప్పి, గొంతునొప్పి తదితర లక్షణాలతో బాధపడుతున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, యువకులు అనే తేడా లేకుండా ఎక్కువ మలేరియా, డెంగీతో ఆస్పత్రులకు వస్తున్నారు. కొందరిలో రోజుల తరబడి 102 డిగ్రీలకుపైన జ్వరంతోపాటు తలనొప్పి, ఒళ్లు నొప్పులు కనిపిస్తున్నాయి. మరికొందరు వాంతులు, విరోచనాలతో బాధపడుతున్నారు. ఒకరకంగా చెప్పాలంటే జిల్లాలో సీజనల్ వ్యాధులు పంజా విసరడంతో అంతకంతకూ జ్వరాలు పెరుగుతున్నాయి. వర్షాలకు ఇళ్ల పరిసరాల్లో కాలువల్లో నీరు నిల్వ ఉండిపోయి దోమల వ్యాప్తి కూడా అధికంగా ఉంది. దీంతో ప్రజలు పెద్ద సంఖ్యలో వైరల్ జ్వరాల బారినపడుతున్నారు. దీంతో కాకినాడ జీజీహెచ్‌తోపాటు నియోజకవర్గాల్లో సీహెచ్‌సీలు, పీహెచ్‌సీలకు వైద్యంకోసం పెద్దఎత్తున వస్తున్నారు. కాకినాడ జీజీహెచ్‌కు రోజుకు 70మంది వరకు జ్వరంతో బాధపడుతు వస్తున్నారు. ఇన్‌పేషెంట్లు కూడా పెద్దఎత్తున ఉన్నారు. మరోపక్క ప్రభుత్వాస్పత్రులు కిక్కిరుస్తుండడంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం పొందుతున్నవారి సంఖ్య రోజురోజుకు గణనీయంగా పెరుగుతోంది. గడచిన నెలరోజుల వ్యవధిలో జిల్లావ్యాప్తంగా 8వేల మందికిపైగా జ్వరంతో మంచాన పట్టినట్లు వైద్యఆరోగ్యశాఖ లెక్కలు చెబుతున్నాయి. అటు పెద్దాపురం మండలంలో డెంగీ జ్వర లక్షణాలతో ఇటీవల ముగ్గురు పాఠశాల విద్యార్థులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు పదో తరగతి విద్యార్థులు కాగా, మరొకరు అయిదో తరగతి విద్యార్థిని. ఈ ముగ్గురు పెద్దాపురంలోని చదలవాడ జిల్లా పరిషత్ హైస్కులు విద్యార్థులేనని చెబుతున్నారు.



సర్వేలో లక్షల్లో జ్వరాలు..

జిల్లాలో వేలాది జ్వరాల నేపథ్యంలో జిల్లావైద్య ఆరోగ్యశాఖ ఫీవర్ టెస్టులు నిర్వహిస్తోంది. ఒకరకంగా ఇది నిరంతరం కొనసాగే ప్రక్రియ. ప్రతి గ్రామంలో ఏఎన్‌ఎం, ఆశావర్కర్లు కలిపి ఇంటింటికీ వెళ్లి జ్వరపీడితులకు టెస్టులు చేస్తున్నారు. మలేరియా, డెంగీ కేసులు ఉంటే గుర్తిస్తున్నారు. ఇలా ఇప్పటివరకు ఈ ఏడాది జనవరినుంచి ఆగస్టు 25వరకు జిల్లా వ్యాప్తంగా 1.29లక్షల మంది జ్వరంతో బాధపడుతున్నట్లు గుర్తించారు. ఇందులో ఈనెల రోజుల్లోనే 8వేల మందికిపైగా ఉన్నట్లు గుర్తించారు. అనధికారికంగా అంతకుమించే ఉంటాయని సమాచారం. అయితే 1.29లక్షలమంది జ్వరం బారిన పడ్డవారిలో మలేరియా బాధితులు పదుల సంఖ్యలో ఉన్నట్లు తేల్చారు. జనవరినుంచి ఇప్పటివరకు జిల్లాలో 4,115 మందికి డెంగీ పరీక్షలు చేస్తే 106 మంది బాధితులున్నట్లు లెక్క తేలింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న ఫీవర్ సర్వేలో రోజువారీ కేసులు అధికంగా వస్తున్నాయి. ప్రధానంగా తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట, పెద్దాపురం నియోజకవర్గాల్లో జ్వరం కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. సబ్‌ప్లాన్ ఏజెన్సీలో ఇంటికో జ్వర పీడితుడు ఉన్నారని గుర్తించారు. కాగా జిల్లాలో జ్వరాల తీవ్రత అధికంగా ఉండడంతో బాధితులు ఎక్కడికక్కడ ప్రైవేటు ఆస్పత్రులకు బాధితులు క్యూకడుతున్నారు. సమీపంలోని పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రులకు పెద్ద ఎత్తున వస్తున్నారు. తీరా వైద్యసదుపాయాలు లేక, ఉన్నచోట వైద్యుల కొరతతో అనేక మంది చేసేదిలేక సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్తున్నారు. తీరా అక్కడ రక్తపరీక్షల దగ్గరనుంచి ప్లేట్‌లెట్ టెస్టుల వరకు చాంతాడంత లిస్టులు రాస్తున్నారు. తమ ఆస్పత్రి ల్యాబ్‌లోనే టెస్టులు చేయించుకు రావాలని అనేకమంది వైద్యులు చీటీలు రాస్తున్నారు. దీంతో వేలకువేలు వదిలిపోతున్నాయి. కొందరికి ప్లేట్‌లెట్ సమస్య అని చెప్పి రోజుల తరబడి చికిత్స పేరుతో ఉంచేస్తున్నారు. దీంతో జ్వర బాధితులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. నిబంధనల ప్రకారం ప్రైవేటు ఆస్పత్రులకు జ్వర బాధితులు వచ్చి రోజుల తరబడి చికిత్స పొందుతుంటే ఆ కేసుల వివరాలను సంబంధిత ప్రైవేటు ఆస్పత్రులు వైద్యఆరోగ్యశాఖకు సమాచారం ఇవ్వాలి. కానీ ఇదేదీ జరగడం లేదు. మరోపక్క ల్యాబ్‌ల దోపిడీ అడ్డుకోవాల్సిన అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు.



కాకినాడ జీజీహెచ్‌లో జ్వర బాధితులు

వాతావరణ పరిస్థితుల్లో మార్పులతో జ్వరాలు



వర్షాకాలంతోపాటు వాతావరణ పరిస్థితుల్లో మార్పులవల్ల జ్వరాలు వస్తున్నా యి. నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దోమ లు పెరిగి మలేరియా తదితర జ్వరాలు వచ్చే అవకాశాలు ఉంటాయి. నీటి వనరుల కలుషితం కావడం వల్ల టైఫాయిడ్ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం వైరల్ జ్వరాలు కూడా ఉన్నాయి. వీటికి ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జ్వరం, రొంప, దగ్గు, వంటి నొప్పులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లకు వెళ్లి చికిత్స చేసుకుంటే తగ్గిపోతుంది. మన ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలి.

-డాక్టర్ బి.జయరాం, వైద్యాధికారి, ఇందిరానగర్ అర్బన్ హెల్త్ సెంటర్, పిఠాపురం



ఉల్లి ధర కిలో రూ.60

- కర్నూలు నుంచి తగ్గిన దిగుమతులు
- అమాంతంగా పెరుగుతున్న ధరలు
- మరో వారంలో ఇంకా పెరిగే అవకాశం

సామర్లకోట, ఆగస్టు 26: నిత్యావసర వస్తువుగా పేరున్న ఉల్లిపాయల ధర కిలో రూ.60కి చేరింది. ఆదివారం, సోమవారాల్లో సామర్లకోట, పెద్దాపురం మార్కెట్‌ల్లో ఇదే రీతిన ఉల్లి ధరలు పెరగడంతో సామాన్యులే కాదు ధనికులు సైతం అమ్మో అంటున్నారు. దీంతో గృహిణులు ఉల్లి ధర చూసి కన్నీళ్లు వస్తున్నాయని వాపోతున్నారు. కాకినాడ జిల్లాకు కర్నూలు నుంచి ఉల్లిపాయలు దిగుమతులు తగ్గడం, మహారాష్ట్ర ఉల్లి ధరలకు గిరాకీ ఉండడంతో ఉల్లి ధరలకు అడ్డుకట్ట వేసేందుకు అధికారులకు సైతం సాధ్యం కాలేదు. దీంతో ఉల్లి ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. రానున్న వారం రోజుల్లో ఉల్లి ధర సెంచరీకి చేరువయ్యే అవకాశాలున్నాయని హోల్‌సేల్ ఉల్లి వ్యాపారులు ఆంధ్రజ్యోతికి సోమవారం రాత్రి తెలిపారు. బెంగళూరు నుంచి దిగుమతులు అవుతున్న కొత్తిమీర, గుంటూరు జిల్లానుంచి దిగుమతులు అవుతున్న కరివేపాకు ధరలకు కూడా రెక్కలు వచ్చాయి. కాగా, చికెన్ ధరలు గత వారం కిలోకు రూ.40 తగ్గగా సోమవారం నాటికి కిలో రూ.220కి పెరిగి పాతధరతో సమానమైంది. దీంతో చికెన్ వ్యాపారులు పెరిగిన ధరతో కాసింత ఊరట చెందారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన జేసీ

పెరుగుతున్న సుద్దగడ్డ వరద ఉధృతి





తుని కత్రాళ్ల కొండ వద్ద ప్రవహిస్తున్న తాండవ జలాలు

'తాండవ'కు జలకళ

తుని రూరల్, ఆగస్టు 26: ఎగువన తాండవ రిజర్వాయర్ నిండుకుండలా మారడంతో ఇరిగేషన్ అధికారులు ఇటీవల గేట్లు ఎత్తారు. దీంతో తాండవ నదిలో రిజర్వాయర్ నీటి ప్రవాహం పోటెత్తుతూ కళకళలాడుతోంది. తుని పట్టణాన్ని ఆనుకుని తాండవ మినీ రిజర్వాయర్ నిండుకుని నిండుకుండలా మారి జలాలు పొంగుతున్నాయి.

చెక్‌పోస్టులతో చెక్!

- పీడీఎస్ బియ్యం అక్రమ తరలింపునకు బ్రేక్
- కాకినాడలో చెక్‌పోస్టుల ఏర్పాటుతో చెన్నై, గుజరాత్ పోర్టులకు వెళ్తున్న సరుకు
- తనిఖీలతో భారీగా తగ్గిన లారీల సంఖ్య

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 26: కాకినాడ యాంకరేజ్ పోర్టునుంచి పీడీఎస్ బియ్యం అక్రమంగా ఇతర దేశాలకు తరలిపోకుండా చెక్ పడింది. చెక్‌పోస్టుల్లో తనిఖీలతో పీడీఎస్ బియ్యం రవాణా కావడంలేదు. తనిఖీల్లో తీవ్ర జాప్యమవుతుందనే నెపంతో బియ్యం ఎగుమతిదారులు ఇతర పోర్టులకు తరలిపోతున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టునుంచి ఆఫ్రికాకు బియ్యం ఎగుమతి అవుతోంది. ఏటా 20లక్షల మెట్రిక్ టన్నుల నుంచి 30లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఎగుమతి అవుతోంది. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేస్తున్నారనే సమాచారంతో మూడునెలలుగా విస్తృతంగా దాడులు చేస్తున్నారు. కాకినాడ పోర్టులో రెండు చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేస్తున్నారు. దీనివల్ల తీవ్ర జాప్యం జరుగుతోందని బియ్యం ఎగుమతిదారులు ఇతర పోర్టులకు తరలిపోతున్నట్లు సమాచారం. చెన్నై పోర్టు, గుజరాత్‌లో కాండ్ల పోర్టుకు ఎగుమతిదారులు వెళ్తున్నట్లు తెలిసింది. వారంరోజులుగా రోజుకు 50 లారీల నుంచి 200 వరకు లారీలు మాత్రమే పోర్టుకు వస్తున్నాయి. గతంలో రోజుకు వెయ్యి వరకు లారీలు బియ్యం లోడుతో వచ్చేవి. ఇప్పుడా సంఖ్య దారుణంగా పడిపోయింది.

చెక్‌పోస్టులు పెంచాలని డిమాండ్

చెక్‌పోస్టులు రెండే ఉండడంవల్ల తనిఖీల్లో జాప్యం జరుగుతుందని, మరిన్ని ఏర్పాటు చేస్తే త్వరితగతిన చెకింగ్ చేయగలరని ఎగుమతిదారులు అభిప్రాయపడుతున్నారు. కాకినాడ యాంకరేజ్ పోర్టు, సీపోర్టుల్లో 30వేలమంది ఉపాధి పొందుతున్నారు. ఇందులో కార్మికులు, గుమాస్తాలు, జట్టు కూలీలు ఉన్నారు. ప్రస్తుత పరిస్థితులపట్ల కార్మికులు ఆందోళన చెందుతున్నారు. బియ్యం ఎగుమతులు ఇతర రాష్ట్రాల పోర్టులకు తరలిపోతే తమఉపాధి పోతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బియ్యం ఎగుమతిదారులు ఇతర రాష్ట్రాలకు తరలిపోకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. బియ్యం ఎగుమతి, తనిఖీలకు సంబంధించి ప్రక్రియ వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

కాకినాడ పోర్టును పరిశీలించిన జేసీ

కలెక్టరేట్(కాకినాడ), ఆగస్టు 26: కాకినాడ యాంకరేజ్ పోర్టును జేసీ రాహుల్‌మీనా, ట్రైనీ కలెక్టర్ భావన, పౌరసరఫరాలశాఖ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే పోర్టులోకి అనుమతించాలన్నారు. వాహనాలకు గేట్‌పాస్ ఇవ్వడంతోపాటు వివరాలు ఎప్పటికప్పుడు సక్రమంగా రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. చెక్‌పోస్టులవద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బంది షెడ్యూల్ ప్రకారం వారికి కేటాయించిన షిఫ్ట్‌ల్లో సమయపాలన పాటించి విధులకు హాజరు కావాలని ఆదేశించారు. పోర్టులో బియ్యం లారీల సంఖ్య, బీవోసీ గేటు ద్వారా వాహనాలు బయ టకు వచ్చే విధానం వంటి వివరాలను సేకరించాలన్నారు. పోర్టులో అక్రమ బియ్యం ఎగుమతులను అరికట్టే చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన బొంబాయికాట, శక్తిగేట్‌వద్ద చెక్‌పోస్ట్‌లను తనిఖీ చేశారు. పౌరసరఫరాలశాఖ అధికారి ప్రసాద్, పాల్గొన్నారు.



కాకినాడ పోర్టులో చెక్‌పోస్టులను పరిశీలిస్తున్న జేసీ రాహుల్‌మీనా



మోతుగూడెంలో కింగ్ కోబ్రా

డాక్టర్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెంలోని ఏపీ జెన్‌కో ఆసుపత్రిలో కింగ్ కోబ్రా కలకలం సృష్టించింది. ఆదివారం రాత్రి తొమ్మిది గంటలకు వాచ్‌మన్ సురేష్ బయట వరండాలో లైటు వేయడానికి వెళ్లాడు. ఆ సమయంలో సుమారు 12 అడుగుల కింగ్ కోబ్రా పాత ఓపీ గదిలోకి ప్రవేశించింది.దీంతో భయపడ్డ వాచ్‌మన్ ఆ గది తలుపులు మూసేసి విషయాన్ని మేనేజ్‌మెంట్‌కు తెలపగా వారు అటవీ శాఖ సిబ్బందికి ఫోను చేసి చెప్పారు. అరగంటలో బీట్ ఆఫీసర్లు వచ్చారు. అయితే పాత ఓపీ రూములోంచి కింగ్ కోబ్రా వరండా ద్వారా బయటకు ఎటెళ్లిందో తెలియలేదు.

- మోతుగూడెం

హ లీ చ లీ

ముమ్మిడివరంలో నల్ల త్రాచు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ కొండాలమ్మ చింత సమీపంలో పాస్టర్ ఎలెక్స్ నివాసంలో సోమవారం ఒక ట్రంకు పెట్టెలోకి నల్ల తాచుపాము దూరి హల్‌చల్ చేసింది. దీంతో ఆ ఇంట్లోని వారు, చుట్టుపక్కల వారు భయభ్రాంతులకు గురయ్యారు. పాస్టర్ ఎలెక్స్ స్నేక్ క్యాచర్ గణేష్ వర్మకు సమాచారం అందించడంతో ఆయన వచ్చి పామును చాకచక్యంగా పట్టి డబ్బాలో బంధించారు. దానిని నిర్మానుష్య ప్రాంతంలో వదిలిపెడతానని గణేష్ వర్మ చెప్పారు.

-ముమ్మిడివరం





రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరం సమీపంలో ఉట్టి ఉత్సవాన్ని తిలకిస్తున్న ప్రజలు



రాజమహేంద్రవరం ఇస్కాన్ మందిరంలో రాధాగోపీనాథులు



కాకినాడ మధురానగర్‌లోని గోకులంలో ప్రత్యేక అలంకరణలో శ్రీకృష్ణుడు



గోదావరిలో హంస వాహనంపై తెప్పోత్సవం



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేటలో బాలకృష్ణుడు

రత్నగిరిపై ఘనంగా శ్రీకృష్ణాష్టమి

అన్నవరం, ఆగస్టు 26: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో సోమవారం శ్రీకృష్ణాష్టమిని వేడుకగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు మంగళవాయిద్యాల నడుమ సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కళామందిరం వద్దకు తోడ్కొని వచ్చి ఆశీనులు గావించారు. స్వామి, అమ్మవార్ల ఎదురుగా సప్తగోమాతలను ఉంచి పండితులు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం భక్తులతో గోవు వెనుక భాగంలో అర్చింపచేసి ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్, పీఆర్వో కృష్ణారావు పాల్గొనగా వైదిక కార్యక్రమాలను ఇంద్రగంటి వెంకటేశ్వర్లు, చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి నిర్వహించారు. తూర్పు రాజగోపురాన్ని ఆనుకుని ఉన్న శ్రీగోకులంలో అర్చకుడు కంచిబొట్ల వరదయ్య ఆధ్వర్యంలో శ్రీకృష్ణపరమాత్మునికి విశేష పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం రామాలయం ఎదురుగా యాదవ బాలలతో ఉట్టి సంబరం జరిపారు. రాత్రి ఏడు గంటలకు స్వామి, అమ్మవార్లను పల్లకిలో తొలిపావంచా వద్దకు మెట్లమార్గంలో తీసుకొచ్చారు. విశేష పూజల అనంతరం భక్తుల కోలాహలం నడుమ ఉట్టి కొట్టించారు. యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కొండ దిగువ గోశాలలో సూపరింటెండెంట్ ఐవీ రామారావు పర్యవేక్షణలో తొలిసారిగా కృష్ణాష్టమి వేడుకలు జరిపారు.



అన్నవరం దేవస్థానంలో గోపూజను తిలకిస్తున్న ఈవో రామచంద్రమోహన్, భక్తులు



ఇస్కాన్‌లో సందడే సందడి

రాజమహేంద్రవరం కల్చరల్, ఆగస్టు 26: రాజమహేంద్రవరం గౌతమ ఘాట్‌లోని ఇస్కాన్ రాధా గోపీనాథ్ దశావతార మందిరంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంబరాన్నంటాయి. తెల్లవారుజామున 4.30 గంటలకు మహా మంగళహారతితో ప్రారంభించి శృంగార హారతి, శ్రీమద్ భాగవత ప్రవచనం, పూర్ణాహుతి, అవబృధ స్నానం నిర్వహించారు. మధ్యాహ్నం ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు, నృత్యం, పాటలు పోటీలు నిర్వహించారు. విజేతలకు హేమా నిమాయిదాస్ సారధ్యంలో బహుమతులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు తదితరులు విచ్చేశారు. సాయంత్రం ఉట్టి ఉత్సవం, అనంత శేషవాహన సేవ, తెప్పోత్సవం, శ్రీకృష్ణ లీలామృత ప్రవచనం, రాధాగోపీనాథులకు మహాకుంభాభిషేకం, మహా ప్రసాద వితరణ జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి శ్రీకృష్ణస్వామిని దర్శించుకుని ఆయన ఆశీస్సులు పొందారు.





వి.సృజన్, ఎస్.రవికిరణ్

జిప్‌మర్, ఎయిమ్స్‌లో 'ఆదిత్య' విద్యార్థులకు సీట్లు

కాకినాడ రూరల్, ఆగస్టు 26: నీట్-2024 ప్రవేశ పరీక్షలో కాకినాడ ఆదిత్య జూనియర్ కళాశాల గంగరాజునగర్ బ్రాంచ్ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిష్టాత్మకమైన జిప్‌మర్, ఎయిమ్స్‌లో మెడికల్ సీట్లు సాధించినట్టు ఆదిత్య విద్యా సంస్థల ఛైర్మన్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. వి.సృజన్ 715, ఎం.విశ్వాంత్ 705 మార్కులతో జిప్‌మర్‌లోను, వైనైమితారాణి 705, ఎస్.రవికిరణ్ 710, ఆర్.రామ్‌గోపాల్ 695 మార్కులతో ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీట్లు సాధించారన్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి ప్రిన్సిపాల్ జె.మొయినా అభినందించారు.





బ్యారేజీపై నుంచి పిచ్చుకలంకను పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్, ఎమ్మెల్యే బండారు, ఒబెరాయ్ సంస్థ ప్రతినిధి, పర్యాటక మ్యాప్‌ను మంత్రి దుర్గేష్‌కు చూపిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

పిచ్చుకలంకను టూరిజం హబ్‌గా తీర్చిదిద్దుతాం

» పెట్టుబడులు పెట్టేందుకు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ముందుకొచ్చారు » పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ » ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి గోదావరి తీరం పరిశీలన

ఆత్రేయపురం, ఆగస్టు 26: ఉభయ గోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న పిచ్చుకలంకను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ముందుకు వచ్చారని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక శివారు పిచ్చుకలంక ప్రాంతాన్ని సోమవారం మంత్రి దుర్గేష్, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, కలెక్టర్ మహేష్‌కుమార్, ముంబయికి చెందిన ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు పరిశీలించారు. 50 ఎకరాల్లో పిచ్చుకలంకను అభివృద్ధి చేసేందుకు ఒబెరాయ్ సంస్థ పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపడంతో ఈ పర్యటన చేపట్టారు. ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులకు పిచ్చుకలంక ప్రాంత అభివృద్ధితో పాటు ఉభయగోదావరి జిల్లాల్లో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాంతాల వివరాలను వివరించారు. పిచ్చుకలంక అభివృద్ధిపై ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులు ఇప్పటికే సీఎం చంద్రబాబును కలిశారని, పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలియజేశారని మంత్రి దుర్గేష్ తెలిపారు. హోటల్స్, రిసార్ట్స్, బోట్ షికారు వంటి వాటికి పిచ్చుకలంక అనువుగా ఉంటుందని సంస్థ ప్రతినిధులకు మంత్రి వివరించారు. అఖండ గోదావరి ప్రాంతం కావడంతో పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు. ఒబెరాయ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ శంకర్‌జీ, ప్రముఖ ఆర్కిటెక్ట్ వినోద్ గోస్వామితో కూడిన త్రిసభ్య కమిటీ బృందం ఈ ప్రాంతాన్ని పరిశీలించి విశిష్ట ప్రాంతాల మ్యాప్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసింది. రానున్న పుష్కరాలకు పిచ్చుకలంకను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రి చెప్పారు. తద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని మంత్రి, ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. కార్యక్రమంలో వాసిరెడ్డి రాంబాబు, జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాస్, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మివెంకన్న, మాజీ సర్పంచ్ జిల్లి కామేశ్వరరావు, టీడీపీ నాయకులు కంఠంశెట్టి శ్రీనివాస్, ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్ళపూడి భాస్కరరావు, కాయల జగన్నాథం, జనసేన నాయకుడు బండారు బాబి పాల్గొన్నారు.

అనుమానం పెనుభూతమై...

భార్యను డంబెల్‌తో మోది హతమార్చిన భర్త

అనపర్తి, ఆగస్టు 26: తూర్పు గోదావరి జిల్లా అనపర్తిలో ఓ వ్యక్తి భార్యపై అనుమానంతో డంబెల్‌తో తలపై మోది హతమార్చాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన తుపాకుల సాయి, అరుణకుమారిలకు 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరు పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం అనపర్తి వచ్చి జీవనం సాగిస్తున్నారు. పది, ఏడేళ్ల వయసున్న ఆడపిల్లలు ఉన్నారు. సాయి కోడిగుడ్ల వ్యాన్‌పై డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందేమోనని అనుమానం పెంచుకున్నాడు. దీంతో తరచూ మద్యం తాగొచ్చి చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. సోమవారం ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. మద్యం మత్తులో ఉన్న సాయి ఎక్సర్‌సైజ్ చేసే డంబెల్‌తో తలపై తీవ్రంగా మోదడంతో తీవ్ర రక్తస్రావమై ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ శివగణేష్, ఎస్‌ఐ శ్రీనునాయక్ సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనపర్తి ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





అరుణ కుమారి మృతదేహం (ఎడమ), పాత చిత్రం (కుడి)

శ్వాస ఆడక మరో బాలుడు మృతి



మృతి చెందిన 45 రోజుల చిన్నారి

చింతూరు, ఆగస్టు 26: శ్వాస ఆడక మరో బాలుడు మృతి చెందిన సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం నర్సింగపేటలో చోటుచేసుకుంది. నర్సింగపేటకు చెందిన దుమ్మిరి బాబూరావు-సుబ్బలక్ష్మి కుమారుడు అశ్విన్ (45 రోజుల చిన్నారి) ఆదివారం వాంతులు, విరోచనాల బారిన పడ్డాడు. దీంతో చింతూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుడు బిడ్డను పరీక్షించి రెండు రకాల సిరప్‌లు ఇవ్వడంతో పాటు మరో రెండు రకాల సిరప్‌లు అందుబాటులో లేకపోవడంతో ప్రైవేటుగా కొనుగోలు చేసుకోమని చెప్పారు. కొద్ది సమయం తర్వాత బిడ్డ ఆరోగ్య పరిస్థితి కాస్త మెరుగుపడినట్టు కనిపించడంతో ఆసుపత్రి నుంచి ఇంటికి బయల్దేరారు. మార్గమధ్యంలో శ్వాస తీసుకోవడంలో బిడ్డ ఇబ్బందిపడింది. దీంతో కూనవరం మండలంలోని కోతులగుట్ట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని... వెంటనే మెరుగైన వైద్యం కోసం భద్రాచలం తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్టు బాధిత కుటుంబీకులు తెలిపారు. ఇప్పటివరకు చింతూరు, కూనవరంల్లో శ్వాసకోశ తదితర వ్యాధుల బారిన పడి ఐదుగురు చిన్నారులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ బాలుడి మృతితో మృతుల సంఖ్య ఆరుకు చేరింది.



నిందితుడు జయరామ్‌ను చూపిస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

పది కిలోల గంజాయి స్వాధీనం

ఒకరి అరెస్టు... రిమాండ్‌కు తరలింపు

గోకవరం, ఆగస్టు 26: గంజాయి కలిగి ఉన్న ఓ వ్యక్తిని సోమవారం అరెస్టు చేసినట్టు నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసులు సోమవారం తెలిపారు. తూర్పు గోదావరి జిల్లా గోకవరం మండలం కృష్ణునిపాలెం పంచాయతీ పరిధిలోని రామన్నపాలెం కూడలి వద్ద బ్యాగ్‌తో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ వ్యక్తిని కోరుకొండ సీఐ వై.సత్య కిషోర్ గమనించి అదుపులోకి తీసుకుని విచారించారు. బ్యాగ్‌ను తనిఖీ చేసి సుమారు 10 కిలోల గంజాయిని గుర్తించారు. నిందితుడిని అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం జాముగూడకు చెందిన వంతల జయరామ్‌గా నిర్ధారించారు. కాగా అతడు ఈనెల 23వ తేదీన 813.590 కిలోల గంజాయితో పట్టుబడిన బొలెరో వాహనం యజమానిగా నిర్ధారణ అయ్యింది. బొలెరో వాహనం వదిలి పరారైన వ్యక్తుల్లో ఒడిసా రాష్ట్రం చిత్రగుంటకు చెందిన డ్రైవర్ కిల్లో జయరాం ఉన్నట్టు తెలిసింది. తాంగి చంద్ర అనే వ్యక్తి వద్ద గంజాయి కొనుగోలు చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. జయరామ్‌ను అరెస్టు చేసి రిమాండు నిమిత్తం రాజమహేంద్రవరం కోర్టుకు తరలించినట్టు డీఎస్పీ చెప్పారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

రౌతులపూడి, ఆగస్టు 26: మాయమాటలు చెప్పి ప్రేమ, పెళ్లి పేరుతో మైనర్ బాలికను యువకుడు గర్భవతి చేసిన ఘటన లచ్చిరెడ్డిపాలెంలో జరిగింది. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి సోమవారం విచారణ చేపట్టారు. కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెంలో చందనాడ కాశీ (21) పాల కేంద్రం నిర్వహిస్తున్నాడు. ఓ బాలిక అమ్మమ్మ గారింటికి వస్తుండగా మాయమాటలు చెప్పి లోబరుచుకుని గర్భవతి చేశాడు. యువతి కడుపు నొప్పి వస్తోందని చెప్పడంతో తల్లిదండ్రులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షించగా బాలిక గర్భవతి అని తేలింది. దీంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి విచారణ చేపట్టారు. యువకుడు ప్రస్తుతం పరారీలో ఉన్నాడు.

రైలు నుంచి జారిపడి ఒడిసా వాసి మృతి

అనపర్తి, ఆగస్టు 26: తూర్పు గోదావరి జిల్లా అనపర్తి రైల్వే స్టేషన్‌లో సోమవారం తెల్లవారుజామున రైలు నుంచి జారిపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. సామర్లకోట జీఆర్పీ ఎస్‌ఐ బి.లోవరాజు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి... సామర్లకోట నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నుంచి ఓ ప్రయాణికుడు జారి పడ్డాడని అనపర్తి రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ బి.శ్రీధర్ సమాచారం మేరకు అనపర్తి వెళ్లేటప్పటికి ఆ వ్యక్తి మృతి చెంది ఉన్నాడు. అతడి వద్ద ఉన్న ఆధార్ కార్డు ప్రకారం ఒడిసాకు చెందిన చిత్రాసేన్ దాస్(42)గా గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. శ్రీధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం • తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

రేపు ఆయిల్‌పామ్ రైతుల సమావేశం

ప్రత్తిపాడు, ఆగస్టు 26: ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో బుధవారం మధ్యాహ్నం 2గంటలకు ఆయిల్‌పామ్ ప్లానిటేషన్‌పై రైతుల సమావేశం నిర్వహిస్తున్నట్టు హార్టి కల్చర్ అధికారిణి దివ్య తెలిపారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాల రైతులు ఈ సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.



భూ బాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న తాటిపాక మధు

వైసీపీ భూ కబ్జాలపై రేపు రాష్ట్ర సదస్సు

కాకినాడ సిటీ, ఆగస్టు 26: విజయవాడలో బుధవారం వైసీపీ భూకబ్జాలపై రాష్ట్ర సదస్సు నిర్వహించనున్నామని, కూరగాయలు, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని సెప్టెంబర్ 1 నుంచి 6 వరకు జిల్లావ్యాప్తంగా నిరసనలు తెలపనున్నామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. కాకినాడ రేచెర్లపేట సీపీఐ జిల్లా కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మధు భూ బాధితుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో, రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ 3 నెలల్లో కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటాయన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో పేదల భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. వారందరూ 28న విజయవాడ సీపీఐ రాష్ట్ర కార్యాలయానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పెద్దిరెడ్డి సత్యనారాయణ, పప్పు ఆదినారాయణ, అప్పలరాజు, జిల్లా సమితి సభ్యుడు కె.రామకృష్ణ ఉన్నారు.

'త్వరలో రెవెన్యూ సదస్సులు'

కాకినాడ సిటీ, ఆగస్టు 26: త్వరలో జరగబోయే రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని ఏపీ రెవెన్యూ అసోసియేషన్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు పితాని త్రినాథ్ విజ్ఞప్తి చేశారు. కాకినాడ రెవెన్యూ అసోసియేషన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. జిల్లాలోని ప్రతి రెవెన్యూ ఉద్యోగి రెవెన్యూ సదస్సుల్లో కష్టపడి పనిచేసి ప్రభుత్వ నమ్మకాన్ని నిలబెట్టుకుని రెవెన్యూశాఖ ఔన్నత్యాన్ని కాపాడాలన్నారు. రెవెన్యూ ఉద్యోగి ఒకే సంఘంలో ఉండాలి తప్ప బహుళ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న తీర్మానానికి కార్యవర్గం మద్దతు తెలిపింది. ఉద్యోగులకు ఐఆర్ ప్రకటించాలని, పీఆర్సీ కమిషన్ చైర్మన్‌ను వెంటనే నియమించి పీఆర్సీని నిర్దీత గడువులోగా అమలు పరచాలని కోరింది. తీవ్ర అనారోగ్య బాధిత కుటుంబాలకు మెడికల్ ఇన్‌వాలిడేషన్ కేసులు ఆమోదించి ఆదుకున్న కలెక్టర్ షాన్ మోహన్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. సమావేశంలో అసోసియేట్ ప్రెసిడెంట్ కె.చంద్రశేఖరరెడ్డి, ట్రెజరర్ ఎస్.రామ్మోహన్, స్టేట్ కౌన్సిలర్ వీఎస్ఆర్ మూర్తి, వైస్ ప్రెసిడెంట్లు జేవీఆర్ రమేష్, కేఎస్‌వీ సుబ్బారావు, వి.భారతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి పీవీ సీతాపతిరావు పాల్గొన్నారు.

2 నుంచి గణేష్ నవరాత్రి ఉత్సవాలు

పిఠాపురం, ఆగస్టు 26: పట్టణంలోని కోటగుమ్మం సెంటర్‌లో జైగణేష్ దేవస్థానంలో సెప్టెంబరు 7నుంచి 16వ వరకూ నవరాత్రి మహోత్సవాలు జరగనున్నాయి. 5వ తేదిన గణపతి మాలధారణ జరగనున్నది. 5వ తేదిన విఘ్నేశ్వరపూజ, ధ్వజారోహణ, స్వామికి అభిషేకాలు, గణపతి దీక్ష మాలధారణ, 6న అభిషేకాలు, 7న వినాయకచవితి రోజున తెల్లవారుజామున 2గంటలు నుంచి విఘ్నేశ్వరపూజ, 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, పట్టు వస్త్రాల సమర్పణ, సాయంత్రం గ్రామోత్సవం, 7వ తేది నుంచి 16వ తేది వరకూ ప్రతి రోజు పాలాభిషేకం నిర్వహిస్తారు. గణేష్‌స్వామికి రోజుకొక అలంకారం చేస్తారు. ఉత్సవాలకు సంబంధించి భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని, భక్తులు విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ ఈవో నున్న శ్రీరాములు, ప్రధాన అర్చకుడు మైలవరపు రామకృష్ణలు కోరారు.

దివ్యాంగుల సామూహిక వివాహాలు

కాకినాడ సిటీ, ఆగస్టు 26: ఆశ్రయ దివ్యాంగుల సమాఖ్య అధ్వర్యంలో పైడా శ్రీనివాస కళ్యాణ మండలంలో దివ్యాంగుల సామూహిక వివాహ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. సమాఖ్య అధ్యక్షుడు సురేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 4 జంటలకు వివాహాలు జరిపించారు. అతిథులుగా ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నారాయణ రావు, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, మాజీ మేయర్ సుంకర పావని, అలయన్స్ అంతర్జాతీయ కమిటీ చైర్మన్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించారు. అలయన్స్ గవర్నర్ వనుం శ్రీనివాసరావు, మాజీ గవర్నర్ కొవ్వూరి మునిరెడ్డి, రీజియన్ చైర్‌పర్సన్ సుభద్ర పాల్‌రాజ్, జడ్‌సీ నాగేంద్ర, నాళం ఆండాళ్, సుచిత్ర, ఉమామనోవికాస కేంద్రం డైరెక్టర్ ఎస్పీ రెడ్డి పాల్గొన్నారు. పురోహితులు కాండూరి సుబ్రహ్మణ్యశర్మ వివాహాలు జరిపించగా అలయన్స్, రోటరీ, లయన్స్ స్వచ్ఛంద సంస్థల సభ్యులు ఈ వివాహాలకు సహకారం అందించారు.

'పర్యావరణ పరిరక్షణే ధ్యేయం'

ఏలేశ్వరం, ఆగస్టు 26: పర్యావరణ పరిరక్షణే ధ్యేయమని ప్రకృతి పర్యావరణ పరిరక్షణ సంఘం అధ్యక్షుడు సఖిరెడ్డి విజయబాబు అన్నారు. సోమవారం పట్టణంలో గురుకుల పాఠశాల ఆవరణలో సుమారు 60 మామిడి, వేప, కదంబరం, బాదం, ఉసిరి, మొక్కలు సంఘ సభ్యులు నాటారు. విద్యార్థులకు పర్యావరణంపై అవగాహన కల్పించారు. గోళ్ల నాగేశ్వరరావు, చందువోలు సాయిరాజా, జ్యోతుల శ్రీనివాస్, వేల్పూరి సూరిబాబు, తిరగటి సత్యనారాయణ, గొల్లాజీ, సిరిపురపు బాబురావు, అనసూరి నాగేశ్వరరావు, చలమచర్ల నాగేశ్వరరావు, కోరాడ నారాయణరావు,ఊర రాజుబాబు ఉన్నారు.

సీపీఎం నాయకుడు రాజగోపాల్ వర్ధంతి

కాకినాడ సిటీ, ఆగస్టు 26: సీపీఎం నాయకుడు ఎం.రాజగోపాల్ వర్ధంతి సందర్భంగా సుందరయ్య భవన్‌లో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి సీపీఎం నాయకుడు వీరబాబు అధ్యక్షత వహించారు. సీపీఎం రాష్ట్ర నాయకుడు మిరియం వెంకటేశ్వర్లు, జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్, జిల్లా నాయకుడు దువ్వా శేషబాబ్జీ మాట్లాడుతూ రాజగోపాల్ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం నాయకులు సీహెచ్ అజయ్‌కుమార్, సీహెచ్ రమణి, షేక్ పద్మ, భూలక్ష్మి, కేఎస్ జ్యోతి, మలకా రమణ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం

కిర్లంపూడి, ఆగస్టు 26: సింహాద్రిపురంలో జిల్లా పశుసంవర్ధక శాఖ, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. కిర్లంపూడి వైద్యాధికారి డాక్టర్ వి.వినోద్ 40 మంది రైతులకు సంబంధించిన 150 పశువులకు వివిధ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ బర్రే నాగేశ్వరరావు, పశువైద్య సిబ్బంది వి.సుధీర్, పి.శ్రీను, టి.మురళీ, ఎ.నాగేశ్వరరావు, బి.రోషిణి, కె.నూకేష్, పి.వెంకన్న, రిలయన్స్ ఫౌండేషన్ రమేష్‌బాబు, రైతులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కరప, ఆగస్టు 26: అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ స్వాతి హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షుడు పెంకే గోవిందరాజు ఆధ్వర్యంలో వాకాడలో ఇటీవల దురదృష్టవశాత్తూ మృతిచెందిన వెలుగుబంట్ల శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు నెలకు సరిపడే నిత్యావసర సరుకులను అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్, టీడీపీ రాష్ట్ర ఆరోగ్య విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు పంపిణీ చేశారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్ట్

జగ్గంపేట, ఆగస్టు 26: రామవరంలో ఒక పాన్‌షాప్‌లో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్టు వచ్చిన సమాచారం మేరకు జగ్గంపేట ఎస్ఐ టి. రఘునాధరావు, సిబ్బందితో దాడి చేసి షాపు యజమాని గ్రామానికి చెందిన మాదాసు సత్యనారాయణను అదుపులోకి తీసుకుని అతడి నుంచి 11 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. అతడిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపరుస్తామని ఆయన తెలిపారు.

మహిళల రక్షణకు పెద్దపీట : సీఐ

కాకినాడ క్రైం, ఆగస్టు 26: మహిళలు, బాలికల రక్షణ, భద్రతే ప్రభుత్వ ప్రాధాన్యాంశంగా పోలీసుశాఖ పనిచేస్తుందని మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు తెలిపారు. జగన్నాథపురంలో బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహిస్తున్న బాలికల వసతిగృహంలో హైస్కూల్ విద్యార్థులకు సేఫ్టీ అండ్ సెక్యూరిటీపై అవగాహన సదస్సు నిర్వహించారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రతకు అనేక చట్టాలు ఉన్నాయని వాటిపై అవగాహన చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహిళా ఎస్ఐ లక్ష్మీకాంతం మహిళలు, బాలికలకు ఉన్న రక్షణ, భద్రత, హక్కులపై వివరించారు. కార్యక్రమంలో వార్డెన్ ఫ్లారెన్స్, నాన్ టీచింగ్ స్టాఫ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ పెద్దిరెడ్డి రామచంద్రరావు

వైభవంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు


పిఠాపురంలో లక్ష్మీ గణపతి సహిత శ్రీకృష్ణ ఆలయంలో పూజలు

అలరించిన చిన్నారుల వేషధారణలు

పలుచోట్ల ఉట్టి కొట్టే సంబరాలు

పోర్టుసిటీ(కాకినాడ), ఆగస్టు 26: జిల్లాలో సోమవారం శ్రీకృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. నగరంలో శ్రీకృష్ణ వేషధారణ పోటీలు ఆకట్టుకున్నాయి. కాకినాడ సినిమారోడ్డులోని సూర్యకళా మందిరంలో ది గోదావరి కళాకౌముది ఫౌండేషన్ ఆధ్వర్యంలో సంస్థ ద్వాదశ వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రత్తి సుధారాణి జ్యోతి ప్రజ్వలన చేయగా మాధవరపు రాజరాజేశ్వరి ప్రార్థనా గీతంతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో చిన్నారులు అలరించారు. జై కృష్ణ ముకుందా.. మురారి, హరే కృష్ణ.. హరే కృష్ణ తదితర గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మహిళలు కోలాటం ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు బాజిబోయిన వెంకటేష్‌నాయుడు, బుర్రా పద్మనాభం, నాదెళ్ల ప్రభుదాస్, ఆకుల వెంకటరమణ, న్యాయవాది కె.శ్రీవాణి, తెలంగాణకు చెందిన ఉమెన్ చైల్డ్ ఎక్స్‌టెన్షన్ అధికారిణి నాదెళ్ల వెంకటలక్ష్మి సౌజన్య పాల్గొన్నారు.

మధురానగర్‌లోని గోకులంలో స్వామిని దర్శించుకునేందుకు పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉట్టి కొట్టి కార్యక్రమంలో యువకులు పోటీ పడి పాల్గొన్నారు. ఎన్‌సీఎస్ సంస్థ అధినేత నారాయణం మురళీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

కాకినాడ సిటీ: కాకినాడ అశోక్‌నగర్‌లోని ఎంఎస్ఎన్ పాఠశాలలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, సత్యభామ వేషధారణలతో చేసిన నృత్యాలు అబ్బురపరిచాయి. విద్యార్థులు కేరింతలతో ఉట్టి కొట్టడానికి పోటీపడ్డారు. తొలుత పాఠశాల ఆవరణలో శ్రీకృష్ణుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమలో ఎంఎస్ఎన్ పాఠశాల డైరెక్టర్ మతుకుమిల్లి శ్రీవిజయ్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ): నాగవసంలోని మౌంట్ లెట్రా జీ కిడ్స్ పాఠశాలలో విద్యార్థులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించారు. కోలాట నృత్యాలు చేశారు. ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టారు. డైరెక్టర్ రామదాసు, ప్రిన్సిపాల్ తమాజ ఆండాల్ పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: ఇంద్రపాలెంలోని గోపాలకృష్ణ మందిరం వద్ద మాజీ ఎంపీటీసీ మాసుమేను గంగయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దంపతులు, టీడీపీ కోఆర్డినేటర్ పిల్లిసత్తిబాబు, మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి, టీడీపీ నాయకులు ప్రభాకర్, చప్పిడి, నురుకుర్తి, దాసు, రాజశేఖర్ ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామిని దర్శించుకున్నారు. ఆలయం వద్ద కోలాటం, గారడీ, చిన్నారుల శ్రీకృష్ణుని గోపికల వేషధారణలు, ఉట్టికొట్టే కార్యక్రమం జరిగాయి. కూటమి నాయకులు పాల్గొన్నారు.



సర్పవరం జంక్షన్:నృత్యం చేస్తున్న చిన్నారులు, తునిరూరల్: తపోవన క్షేత్రంలో ఉట్టి కొట్టే వేడుకలు


ప్రత్తిపాడు: ఒమ్మంగిలో ఆకట్టుకున్న వేషధారణలు


జగ్గంపేటలో..

సర్పవరం జంక్షన్: వాకలపూడి సన్‌రైజ్ స్కూల్లో కరస్పాండెంట్ ఝాన్సీకృష్ణ ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. కృష్ణ గోపికల రూపంలో విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.

పిఠాపురం: పట్టణంలో శ్రీకృష్ణ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పలు ప్రాంతాల్లో చిన్నారులు, పెద్దలు ఉట్టి కొట్టేందుకు పోటీలు పడ్డారు. మంగాయమ్మరావుపేటలో లక్ష్మీగణపతి సహిత శ్రీకృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు అనంతరం విశేష అలంకారం చేశారు. డీఎస్పీ ధర్మేంద్ర తదితరులు కృష్ణుడిని దర్శించుకున్నారు. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ అధ్యక్షుడు పల్లా సురేష్, సూరిబాబు, పెండ్యాల లోవరాజు, అల్లుబోయిన భాస్కరరావు, కొత్త సత్యనారాయణ, అల్లు నాగబాబు, గోపాలం తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు: పట్టణంలో కొత్తపేట గీతామందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఏకాహం, భక్తి గీతాలాపన, హరేరామ నామ సంకీర్తన, అఖండ గీతారాధన ఆలపించారు. పలు గృహాల్లో తల్లిదండ్రులు తమ చిన్నారులను శ్రీకృష్ణుని వేషధారణ చేసి చూసుకుంటూ మురిసిపోయారు. వీధుల్లో శ్రీకృష్ణులు సందడి చేశారు.

గొల్లప్రోలు రూరల్: తాటిపర్తి, చినజగ్గంపేట, దురాడ తదితర గ్రామాల్లో శ్రీకృష్ణ ఆలయాలు, మందిరాల్లో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిగాయి. భక్తులు స్వామిని దర్శించి పూజలు జరిపారు. ఆయా ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కిర్లంపూడి: రాజుపాలెంలో మురళీకృష్ణ క్రషర్ యాజమాన్యం గణేశుల రాంబాబు, లక్ష్మణరావు, కుమారులు మురళీకృష్ణ రాజా నాగార్జున ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. చిల్లంగి రామాలయంపై గీతోపదేశం రథం ప్రారంభించారు. బూరుగుపూడిలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలకు జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ హాజరై స్వామిని దర్శించుకున్నారు.

పెద్దాపురం: పట్టణ పరిధిలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న కృష్ణమందిరంలో తెల్లవారుజాము నుంచే మందిరంలో వేడుకలు ప్రారంభమయ్యాయి. గుడివాడ గ్రామంలో కృష్ణమందిరంలో కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. శ్రీకృష్ణుడి జన్మ వృత్తాంతాన్ని భక్తులకు వివరించారు. భారీ అన్నదానం జరిగింది. అనంతరం ఉట్టి మహోత్సవాన్ని ఉత్సాహంగా నిర్వహించారు.

జగ్గంపేట: జగ్గంపేట శ్రీప్రజ్ఞ పాఠశాలలో చైర్మన్ బండారు నాగబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు గోపికలు, కృష్ణుని వేషధారణలో ఆకట్టుకున్నారు. ఉట్టికొట్టే ప్రదర్శనను అందరూ తిలకించారు. కరస్పాండెంట్ చిత్రా నాగేశ్వరరావు, డైరెక్టర్ శ్వేత, కాలేజి ప్రిన్సిపాల్ కె.అభి, స్కూల్ ప్రిన్సిపాల్ భాను, కొల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.

గండేపల్లి: మల్లేపల్లి బీసీకాలనీ పాతూరులో వేడుకలు ఘనంగా జరిగాయి. జగ్గంపేట జనసేన ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ స్వామిని దర్శించుకున్నారు. పంచికట్ల గంగరాజు, రామకృష్ణ, వెంకటరమణ, శ్రీను, పెద్ద గంగరాజు దంపతులు, రామకుర్తి బ్రహ్మాజీ, మాదవరపు వీరబాబు, సత్యంశెట్టి గణేష్, సోమరాజు ఉన్నారు.

ప్రత్తిపాడు: మండలంలోని ఒమ్మంగి భారతి విద్యా సంస్థల్లో చిన్నారులు వేషధారణలు, ఉట్టికొట్టే సంబరాలు అలరించాయి. రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయం ప్రాంగణంలో కృష్ణుడి గుడిలో విశిష్ట పూజలు నిర్వహించారు. ధర్మవరంలో యాదవ యూత్, కృష్ణుడి బొమ్మలతో కూడిన ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు.

తుని రూరల్: తేటగుంట, డి.పోలవరం, తుని, ఎస్ఎస్‌వీనగరంలో శ్రీకృష్ణ భగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మిక పీఠం తపోవన క్షేత్రంలో ఉట్టికొట్టేవేడుక, పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పెద్దఎత్తున భక్తులు తపోవన పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంత సరస్వతి స్వామిజీ ఆశీర్వచనాలు తీసుకున్నారు. తుని కొత్తపేటలో నారాయణ స్కూల్ పక్కన ప్రత్యేకవేదికపై కృష్ణుడిని కొలువుతీర్చి భగవత్ గీతా పఠనం, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొండంగి: ఏ.కొత్తపల్లి కదంబ క్షేత్రంలో శ్రీ కృష్ణునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పిఠ చిన్నయ్యపాలెంలో జరిగిన వేడుకల్లో టీడీపీ నేతలు యనమల రాజేష్, కొయ్యా రామకేశవ పాల్గొన్నారు. ఏవినగరం శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరుని ఆలయంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేసి సంప్రదాయబద్ధంగా ఉట్టికొట్టే ఉత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ధర్మకర్త యనమల నగశ్వర్రావు తదితరులు ఉన్నారు.

ఏలేశ్వరం: పట్టణంలో యాదవ సంఘం వాగు వారి వీధిలో కృష్ణుని ఆలయం వద్ద ప్రత్యేక పూజలు చేసి, విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో మహిళలు పారాయణం నిర్వహించారు. లింగంపర్తి నాడీపతి గోశాలలో గోవులతో ఉట్టి కొట్టే ఉత్సవ కార్యక్రమం నిర్వహించారు.

రౌతులపూడి: రౌతులపూడి, ఎ.మల్లవరం, ఎస్.అగ్రహారం, మూలగపూడి తదితర గ్రామాల్లో వేడుకలు జరిగాయి. భక్తులు ఆలయానికి చేరుకుని పూజలు చేశారు. ఉట్టి కొట్టేందుకు యువకులు పోటీపడ్డారు.


పిఠాపురంలో థెరిస్సా విగ్రహానికి నివాళి దృశ్యం

మదర్ థెరిస్సా జయంతి

కరప, ఆగస్టు 26: దేశంలో అభాగ్యులకు తన అమృతహస్తాలతో విశేషమైన సేవలందించిన మదర్ థెరిస్సా స్ఫూర్తిని ప్రతీ ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని కరప ఎస్ఐ వసుపులేటి శోభన్‌కుమార్ కోరారు. సోమవారం విజయరాయుడుపాలెంలో మదర్ థెరిస్సా 114వ జయంతిని పీస్ సేవా సంఘం వ్యవస్థాపకులు మండల దైవ సమాధానం, సుధీర్‌కుమార్, జైభీమ్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. 180 మంది మహిళలకు చీరలు, లుంగీలు, తుమాలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి.రాఘవ, ఉప సర్పంచ్ బూలా శారద, కాద వెంకటేశ్వరరావు, మాత అప్పారావు, కాకర్ల దర్యయ్య, కరప సర్పంచ్ ఆశజావి లోవీవాసు, ప్రత్తిపాటి బుల్లిరాజు, పి.వీరభద్రరావు, పాస్టర్ సామ్యూల్, వీఆర్వో నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పిఠాపురం: పట్టణంలోని ఎస్ఎఫ్ఎస్ స్కూలు మదర్‌థెరిస్సా విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ బొజ్జా రామయ్య, జనసేన మహిళా విభాగం ఉభయ గోదావరి జిల్లాల కోఆర్డినేటర్ చల్లా లక్ష్మీ, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సారా శేఖర్, కర్రి రాంబాబు తదితరులు ఉన్నారు.

మదర్ థెరిస్సా అవార్డులు

కరప, ఆగస్టు 26: కరప మండలం గురజనాపల్లికి చెందిన మానవత్వం స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ జొన్నలగడ్డ రాజు జాతీయ మదర్ థెరిస్సా అవార్డుకు ఎంపికయ్యారు. మదర్ సర్వీస్ సొసైటీ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా విజయవాడలో జరిగిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాజు చేస్తున్న సామాజిక సేవలకు గుర్తింపుగా మదర్ థెరిస్సా అవార్డు అందించారు.

కొత్తపల్లి: మదర్ థెరిస్సా స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టే మండలంలో నాగులాపల్లి గ్రామానికి చెందిన లక్ష్య చారిటబుల్ సొసైటీ చైర్మన్ శివారెడ్డి మదర్ థెరిస్సా అవార్డును విజయవాడలో అందుకున్నారు.

మద్దా కృష్ణమూర్తికి సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ అవార్డు

సర్పవరం జంక్షన్, ఆగస్టు 26: ఇంటిలో, మేడపై విరివిగా మొక్కలు నాటి మొక్కల పెంపకం వల్ల కలిగే లాభాలపై విస్తృత అవగాహన కల్పిస్తున్న రమణయ్యపేటకు చెందిన రిటైర్డ్ టీచర్, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మద్దా కృష్ణమూర్తికి సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ అవార్డు లభించింది. స్థానికంగా సిటీ ఆఫ్ టెర్రస్ గార్డెన్ కాకినాడ అధ్యక్షుడు మునిప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణమూర్తికి అవార్డును బహుకరించారు. మునిప్రసాద్ మాట్లాడుతూ 65 ఏళ్లలో కూడా మొక్కలు పెంచడం, పర్యావరణ సమతుల్యత, కాలుష్య రహిత సమాజం కోసం కృష్ణమూర్తి చేసిన సేవలకు ఈ అవార్డును వచ్చిందన్నారు. సంస్థ సభ్యులు విజయలక్ష్మి, రాధ, వేణుగోపాలం పాల్గొన్నారు.

'జనసేన జెండా ఎగురవేయాలి'

గండేపల్లి, ఆగస్టు 26: ప్రతీ గ్రామంలో జనసేన జెండా ఎగురవేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ అన్నారు. సోమవారం ఆయన పత్రిక ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 2న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పుట్టిన రోజును ఘనంగా నిర్వహించుకుందామన్నారు. ఆయన ఆశయాలకు తగ్గట్టుగా క్లీన్ ఆంధ్ర గ్రీన్ ఆంధ్ర కార్యక్రమాన్ని చేపట్టాలని కేంద్ర కార్యాలయం ప్రకటించిందని దానికి తగ్గట్టుగా వేప, ఉసిరి, చింత, రావి, నేరేడు మొక్కలను ప్రతీ గ్రామంలో నాటుకుందామని, సెప్టెంబరు 2న జెండా ఆవిష్కరణలు చేపట్టాలని పేర్కొన్నారు.

పెరుగుతున్న సుద్దగడ్డ వరద ఉధృతి


తాగునీటిని అందించేందుకు మున్సిపల్ సిబ్బంది, కాలనీవాసుల ప్రయత్నం

జగనన్న కాలనీకి నిలిచిన తాగునీటి సరఫరా

గొల్లప్రోలు, ఆగస్టు 26: సుద్దగడ్డ వరద ఉధృతి సోమవారం మరింత పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చి చేరుతున్న వరద జలాలుతో సుద్దగడ్డ(కొండ)కాలువ గట్లుకు సమాంతరంగా ప్రవహిస్తున్నది. గొల్లప్రోలు పట్టణ శివారులోని జగనన్న కాలనీకి వెళ్లే రహదారిపై 5 అడుగులకు పైగా ఎత్తులో వరద నీరు చేరింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. కాలనీకి తాగునీటి సరఫరా నిలిచిపోయింది. వాటర్ ట్యాంకర్లును ఒకవైపు ఉంచి పైపులు ద్వారా తాగునీటిని కాలనీకి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. సోమవారం సాయంత్రం పైపుల ద్వారా తాగునీటిని సరఫరా చేసేందుకు నగరపంచాయతీ సిబ్బంది, కాలనీ వాసులు ప్రయత్నిస్తున్నారు. తాగునీటి సరఫరాకు శాశ్వత ఏర్పాట్లు చేయకుంటే వరదల సమయాల్లో ఇబ్బందులు తప్పడంలేదని అక్కడి ప్రజలు చెబుతున్నారు. మరోవైపు గొల్లప్రోలు-తాటిపర్తి పంచాయతీరాజ్ రహదారిపై వరదనీరు ప్రవహిస్తోంది.

బీజేపీ సభ్యత్వాలు లక్షకు చేరుకోవాలి

జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్

ప్రత్తిపాడు, ఆగస్టు 26: నియోజకవర్గంలో బీజేపీ సభ్యత్వాల సంఖ్య లక్షకు చేరుకోవాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ చెప్పారు. స్థానిక రాజా కింగ్‌బాబు రాజు స్వగృహం వద్ద సోమవారం మండల బీజేపీ కార్యకర్తల సమావేశానికి మండలాధ్యక్షుడు కందా వీరస్వామి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా రామ్‌కుమార్ మాట్లాడుతూ సెప్టెంబరు1నుంచి జరిగే సభ్యత్వ నమోదును విజయవంతం చేయాలని, ప్రత్తిపాడు మండలంలో 25వేలు సభ్యత్వ నమోదు పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు, జిల్లా కిసాన్‌మోర్చా అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, జిల్లా ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కించు జోగిరాజు, మండల బీజేపీ ఉపాధ్యక్షుడు బుగతా వీరబాబు, జిల్లా మహిళా మోర్చ కార్యదర్శి ఈర్ల బేబి, నాగేశ్వరరావు, ఇంటి నాగేశ్వరరావు, నక్కా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అగ్రగామిగా నిలుపుదాం

పిఠాపురం, ఆగస్టు 26: సభ్యత్వ నమోదులో పిఠాపురం నియోజవర్గాన్ని అగ్రగామిగా నిలుపుదామని సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి బుర్రి మురళీధరరావు పిలుపునిచ్చారు. పట్టణంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో బీజేపీ సభ్యత్వ నమోదు అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 100 సాధారణ సభ్యత్వాలు చేసిన వారు ఒక క్రియాశీలక సభ్యత్వం పొందుతారని తెలిపారు. జిల్లా సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి అనపర్తి వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శులు గండి కొండలరావు, దాట వెంకట సూర్యనారాయణరాజు, నియోజకవర్గ కన్వీనర్ బుర్రా కృష్ణంరాజు, పట్టణ అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, దోనే అచ్యుతరామయ్య తదితరులున్నారు.

ఆందోళన విరమించిన ఏపీవో గంగాభవాని

సర్పవరం జంక్షన్, ఆగస్టు 26: కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట మండల మహిళా సమాఖ్య వద్ద ఆదివారం మధ్యాహ్నం నుంచి డీఆర్‌డీఏ ఉన్నతాధికారుల తీరుకు నిరసగా ఆందోళన చేపట్టిన జిల్లా వీవోఏల సంఘాధ్యక్షురాలు కందా గంగాభవాని ఆందోళన విరమించారు. కలెక్టరేట్‌లో ఆదివారం లక్‌పతి దీదీ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభా పురస్కార అవార్డు పంపిణీ చేస్తామని చెప్పిన అధికారులు ఇవ్వకుండా అవమానం పాలు చేయడంతో మనస్తాపంతో డీఆర్‌డీఏ పీడీ, డీపీఎంల తీరుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. దాంతో ఆదివారం అర్థరాత్రి 12.30 గంటల సమయంలో డీఆర్‌డీఏ పీడీ శ్రీరమణి ఆదేశాల మేరకు డీపీఎంలు బాబూరావు, రాయ్, వెంకటేశ్వరరావు వచ్చి గంగాభవానీతో చర్చించి ఆందోళన విరమించాలని కోరారు. సోమవారం సమాఖ్య వద్ద విలేకర్లతో ఆమె మాట్లాడుతూ ఆందోళనలో పాల్గొన్న సహచర వీవోఏలు, మహిళా సంఘాల ప్రతినిధులు, మీడియాకు కృతజ్ఞతలు తెలిపారు.


వేదాశీర్వచనం పొందుతున్న డీఆర్వో ఉదయభాస్కర్

భీమేశ్వరాలయంలో డీఆర్వో పూజలు

సామర్లకోట, ఆగస్టు 26: పశ్చిమ గోదావరి జిల్లా రెవెన్యూ అధికారి ఉదయభాస్కర్ సతీసమేతంగా సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయానికి సోమవారం చేరుకుని స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. డీఆర్వో దంపతులకు ఆలయ ఈవో బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో పండితులచే సాదరంగా స్వాగతం పలికారు. ఆలయ ఆవరణలో అన్ని ఉపాలయాలను సందర్శించి భీమేశ్వర స్వామికి విశేష అభిషేకాలు, బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష పుష్పార్చన, విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. నంది మండపం వద్ద పండితులచే వేదస్వస్తితో ప్రసాదాలు స్వీకరించారు. ఈవో స్వామి, అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. వీఆర్వో నలజర్ల మురళీకృష్ణ, పండితులు పాల్గొన్నారు. శ్రావణమాసం పర్వదినాలు ముగింపు పురష్కరించుకుని సోమవారం భీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు.

రామేశ్వరంపేటలో ఆందోళన

గండేపల్లి, ఆగస్టు 26: మండలంలో సూరంపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో రామేశ్వరంపేట గ్రామంలో బ్రాందీషాపునకు సమీపంలోని కాలనీకి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సోమవారం ఆ కాలనీవాసులు ఆందోళనకు దిగారు. మందుబాబులు వీరంగం సృష్టిస్తున్నారని, గొడవలకు దిగుతున్నారని అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.


పెద్దాపురంలో అధికారులతో మాట్లాడుతున్న జేసీ

ఇసుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించిన జేసీ

పెద్దాపురం, ఆగస్టు 26: స్థానిక ఏడీబీ రహదారిలో ఉన్న ఇసుక స్టాక్ పాయింట్‌ను జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా సోమవారం పరిశీలించారు. స్టాక్ పాయింట్‌లోని ఇసుక నిల్వ వివరాలు, పంపిణీ ఏ విధంగా జరుగుతోంది, రవాణా చార్జీలు తదితర విషయాలపై ఆరాతీశారు. ప్రభుత్వం పారదర్శకంగా ఇసుక విధానాన్ని నిర్వహిస్తుందని, అందరికీ అందుబాటులో ఇసుక లభ్యమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం స్టాక్ పాయింట్ వద్ద సుమారు 7 వేల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట ట్రైనీ కలెక్టర్ హెచ్ ఎస్.భావన, డీటీ టి.కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోటలో...

సామర్లకోట, ఆగస్టు 26: సామర్లకోట-పెద్దాపురం ఏడీబీ రోడ్డులో ఉన్న ఇసుక స్టాక్‌పాయింట్‌ను జేసీ రాహుల్ మీనా రెవెన్యూ, పోలీసు ఉన్నతాధికారులతో కలిసి పరిశీలించారు. స్టాక్‌పాయింట్‌లోని ఇసుక నిల్వలు, వివరాల సమాచారాన్ని సేకరించారు. జేసీ వెంట ట్రైనీ కలెక్టర్ హెచ్‌ఎస్.భావవ, డిప్యూటీ తహశీల్దార్ టి.కాంతారావు, వీఆర్వోలు ఉన్నారు.

సత్యదేవుడికి డీఎంహెచ్‌వో పూజలు

అన్నవరం, ఆగస్టు 26: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో సోమవారం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి నరసింహ నాయక్ కుటుంబసభ్యులతో స్వామివారి వ్రతమాచరించి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.


సత్యదేవుడి వ్రతమాచరిస్తున్న డీఎంహెచ్‌వో

బెల్లపు ఊట ధ్వంసం

గండేపల్లి, ఆగస్టు 26: సూరంపాలెం గ్రామ శివారులో పోలీసులు దాడి చేశారు. 25లీటర్ల సారా, 1600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.